

# నా కళ్ళతో నాన్న

– లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**మనసులో** ఒకటి పెట్టుకుని బయటికి మరొకలా ప్రవర్తించడం, పనులను జరిపేందుకు సౌమ్యంగా, వినయంగా నడుచుకోవడం మానవ సహజం. కానీ, ఎంత కష్టమైనా నిజాన్ని దాచకుండా, తన పాలసీలకు ఎన్నడూ వ్యతిరేకంగా పనిచెయ్యని మా నాన్న చాలా ఆత్మగౌరవంగల వ్యక్తి. అలా నిక్కచ్చిగా మాట్లాడే స్వభావం ఉండడం వల్ల తనకి ఉన్న స్నేహితులను వేళ్ళమీద లెక్కపెట్టొచ్చు. తండ్రిని మించిన కూతురిలా నేను ప్రశ్నలకి సూటిగా సమాధానం చెప్పడంతో పాటు వ్యంగ్యంగా మనుషులను ఖండిస్తూ మాట్లాడతాను. అయినా నన్ను భరించే స్నేహితులు ఉండడం ఒక అదృష్టమే.

'హిమాలయం మహిమాలయం' రాసిన కొన్ని సంవత్సరాలకి ప్రేం సిద్ధార్థ్‌పై నమ్మకం పోవడంతో ఎంతమంది అడిగినా రీప్రింట్‌ని వెయ్యలేదు. ఆయన నమ్మనిది, ఆచరించనిది నలుగురూ చదివి పాటించడం ఇష్టంలేదు కనుక పోయిన నెల్లో ఫోన్ చేసినవారికి కూడా రీప్రింట్ వేసే ఉద్దేశం లేదని చెప్పారు. ఆయన నియమాలకి కట్టుబడి, ఆలోచనల్లో మనోభావంలో రాజీపడే ప్రసక్తి లేదని కొంతమంది ఎడిటర్లతో పనిచేయడం మానేసారు.

మా తాతయ్య అధికంగా లౌక్యంగల మనిషైనా ఆ పోలిక మా నాన్నకి అస్సలు రాలేదు. అలాకాకుండా లౌక్యం ఎరిగినట్టైతే మరిన్ని సినిమాలు, సీరియల్స్‌ను రాసుండేవారు. కాబట్టి నేను ఇంజనియర్‌లా ఉద్యోగం చేయకుండా ప్రొఫెసర్‌నై కాస్మాలజీ పై రిసర్చ్ చేసేదాన్ని. అప్పుడు 'నా కళ్ళతో నాన్న' కేవలం నా కళ్ళకే అంకితమయ్యేది.

మా నాన్నతో మాట్లాడిన ప్రతీ ఒక్కరికి తెలిసిన విషయం ఆయన ముక్కుసూటి మనిషి అని. ఆయన వైట్‌లైస్‌ని కూడా ఇష్టపడరు - అది చుట్టాలైనా, ఫ్రెండ్స్ అయినా, ఫేన్స్ అయినా! ఆయన సమాధానాలు కొన్ని నవ్వు తెప్పిస్తాయి. కొన్ని ఆశ్చర్యపరుస్తాయి.

ఒకరోజు ఒక గొప్ప రైటర్ తను రాసిన కథల పుస్తకాన్ని మా నాన్నకి ఇచ్చి, "మీరు ముందు మాట రాయండి" అన్నారు. మా నాన్న ఆ కథలను చదివి, "నేను రాయనండి చాలా చెండాలంగా ఉన్నాయి" అని చెప్పారు.

మరో రోజు ఒక ఐ.పి.ఎస్ ఆఫీసర్ ఇంటికి డిన్నర్‌కి వెళ్ళినప్పుడు "వంటలెలా ఉన్నాయండి?" అని వాళ్ళు అడిగారు.

"అన్నిట్లో ఉప్పు బాగా ఎక్కువైంది. అందుకే నాకు ఏదీ నచ్చలేదు" అని చెప్పారు.

మరోసారి మా నాన్న రాసిన సినిమా ప్రీవ్యూని చూసాక ఆ డైరెక్టర్ "ఎలా ఉందండి సినిమా?" అని అడిగినప్పుడు "నా నవలని మీరు పాడు చేసారు" అని అన్నారు. (అందుకే కాబోలు, మా ఇంటికి వచ్చిన అందరూ మా నాన్నతో కొంచెం భయంగా, చాలా వినయంగా ప్రవర్తిస్తారు.)

అలా బయటవారితోనే కాదు, బంధువులతో కూడా బాగా ముక్కుసూటిగా మాట్లాడతారు. మా చుట్టాల్లో ఒక అమ్మాయి ప్రవర్తన నచ్చక వాళ్ళ అత్తగారితో మాట్లాడుతూ "ఇంక నుండి మీ కోడల్ని మా ఇంటికి పంపకండి. తన ప్రవర్తన ఏం బాలేదు" అని అన్నారు. మరొకరు పిల్లల్ని అతిగా గారాబం చేసి చెడగొట్టడం చూసి, "పిల్లల్ని పెంచే తీరు ఇది కాదు. నువ్వు సరిగ్గా పెంచడం లేదు" అని అన్నారు. ఒక పెళ్ళిలో పెళ్ళికొడుకు తండ్రి "మా కోడలు ఎలా ఉందండి?" అని అడిగినప్పుడు "మీ కోడలు చాలా క్రూకెడ్ అమ్మాయిలా ఉంది" అని అన్నారు. మొదట్లో చాలా మురిపెంగా ఉన్నా కొన్ని సంవత్సరాల తరువాత ఆ అమ్మాయి నిజస్వరూపం బయటపడింది.

మా తాతయ్యలానే మా నాన్నకూడా మనిషిని చూసి వారి గుణాన్ని, మనస్తత్వాన్ని అంచనా వేయగలుగుతారు. ఈ విషయంలో ఎప్పుడూ ఎవర్నీ తప్పు పట్టలేదు. ఆయనలా మనుషులని నేను చదవగలిగి ఉంటే ఎన్నో తప్పులను చేసి ఉండేదాన్నికాదు. ఈ విషయంలో మా ముగ్గురికీ ఆయన పోలిక రాలేదు. మా ముగ్గురిలో ఎక్కువ లౌక్యం తెలిసింది ఊహ.

మా నాన్న సభలని, పార్టీలని, గెట్ టు గెదర్స్‌ని ఎక్కువగా ఇష్టపడరు. తరచూ ఫోన్ చేసి మాట్లాడి, ఇంటికి వచ్చిన వాళ్ళని ఎంటర్‌టెయిన్ చేసే సమయం, ఓపిక చాలా తక్కువ. ఎక్కువ ఆర్భాటాలేమీ లేకుండా చాలా సింపుల్‌గా ఉండే మనిషి. అవే పోలికలు నాకూ వచ్చాయి. ఒకరోజు "వాల్‌మార్ట్‌కి వెళ్దామా?" అని కావ్య అడిగింది. నేను నా లిస్ట్‌ని, మా నాన్న తన లిస్ట్‌ని తీసుకుని "వెళ్దాం" అన్నాము.

"అదేంటి? ఇలానే వస్తారా" అని మా బదులు కోసం ఎదురుచూసింది.

మేము తలాడించేసరికి, "లిపి నువ్వు ఇంట్లో వేసుకునే బట్టల్లో బయటికి వెళ్తావా? వెళ్ళి చేంజ్ చేస్కో" అంది. అది విని మా నాన్న కూడా బట్టలు మార్చారు. అదే కావ్య స్థానంలో మా అమ్మ ఉంటే "ఏమౌతుంది? వాల్‌మార్ట్‌కే కదా! ఏం ఫరవాలేదు, మేము ఇలానే వస్తాం" అని అనుండేవాళ్ళం.

మా అమ్మ మాటని వినే ఉద్దేశం ఉన్నాకూడా తనని సతాయించిన తరువాతే ఒప్పుకుంటాను. ప్రపంచంలో నా కోపాన్ని, అసహనాన్ని, బద్దకాన్ని, అతిశుభ్రాన్ని భరించగలిగే ఏకైకవ్యక్తి మా అమ్మ(మా నాన్నకూడా భరించలేకపోవచ్చు)

మా అమ్మకి, నాన్నకి చాలా వయసు తేడా ఉండడంతో మా అమ్మ చాలా చిన్నపిల్లలా కనబడుతుంది. "ఈవిడ మీ అమ్మాయా?" అని వాళ్ళిద్దరూ కలిసి బయటికి వెళ్ళినప్పుడు మా నాన్నని ఎవరో అడిగారు. అది విని మురిసిపోయిన మా అమ్మ మేము స్కూల్, కాలేజీల నుండి ఇంటికి వచ్చాక సంబరపడిపోతూ "నన్ను చూసి నాన్న వాళ్ళ అమ్మాయా? అని అడిగారు" అని మా నాన్న వంక చూసి "అంత చిన్న పిల్లలా ఉన్నానా చూడ్డానికి?" అని నవ్వింది.

మా అమ్మకి ఎవరైనా కాంప్లిమెంట్ ఇచ్చినప్పుడు తనతో సమానంగా మా నాన్నకూడా సంతోషిస్తారు. నాకు తెలిసి మా నాన్న ఆనందానికి సగం కారణం మా అమ్మ ముఖంలోని సంతోషమే. ఎందుకంటే, ఎప్పుడైనా మా అమ్మ కోపంగా, లేక బాధగా, లేదా విసుగ్గా ఉన్నప్పుడు మా నాన్న ముఖంలో చిరునవ్వు ఉండదు.

పోస్ట్ ఆఫీస్ లేదా బ్యాంక్‌లో పని ఉన్నప్పుడు ఊహ, మా అమ్మ కలిసి వెళ్ళేవారు. ఒకరోజు ఇంటిపని ఎక్కువ అవ్వడంతో మా అమ్మ తనతో వెళ్ళలేకపోయింది. ఇంటికి వచ్చాక ఊహ చాలా కోపంగా అందరినీ కసురుకుంది.

"ఏమైంది చిన్నా?" అని మా అమ్మ అడిగితే "ఏం కాలేదు" అని జవాబిచ్చింది.

"బ్యాంకులో ఏమైనా అయ్యిందా?" అని అమ్మ అడిగింది.

"లేదని చెప్పాను కదా" అని అరిచి తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆ రోజు సాయంత్రం మా అమ్మతో "నువ్వు ఎప్పుడూ చీరలే కట్టుకోవచ్చుకదా? జీన్స్‌లు నీకెందుకు?" అని ఊహ అడిగింది.

"ఏ? ఎందుకు వేసుకోవద్దు?" అని మా అమ్మ బిత్తరపోయి అడిగింది.

"బ్యాంక్‌లో వాడు 'మీ చెల్లి రాలేదేంటి ఈరోజు'? అని అడిగాడు. నువ్వు నా చెల్లి అనుకున్నాడట. చీర కట్టుకుంటేనే నిన్ను బయటకి తీసుకెళ్తా, లేకపోతే లేదు" అని తన గదిలోకి వెళ్ళి తలుపువేసుకుంది. ఈ విషయం మా చుట్టాలకి చెప్పి అందరం నవ్వుకుంటుంటే మొదట్లో కోప్పడినా తరువాత తను మాతో కలిసి నవ్వింది.

ఒకసారి రెస్టారెంట్‌లో మార్గరీటా ఆర్డర్ చేసినప్పుడు మా అమ్మ, నాన్న తప్ప టేబుల్ మీద ఉన్న అందరి ఐడీలు అడిగారు. "నన్ను అడగలేదేంటి? ఓల్డ్‌గా కనబడుతున్నానా?" అని మా అమ్మ బాధపడుతూ అడిగింది.

"లిపి పక్కన కూర్చునేసరికి ముఖంలో పోలిక తెలిసి నీ ఐడీ అడగక్కర్లేదనుకుని ఉంటారు" అని మా నాన్న చెప్పారు.

మా నాన్న తెలుగు రైటర్ అవ్వడం వల్లో, మా అమ్మ ఆచారుల కుటుంబంలో పెరిగినందుకో చిన్నతనం నుండి తెలుగు చక్కగా నేర్పారు. ఒత్తులు, పొల్లులు, ళ, ణ పలకడం చిన్నప్పటినుండీ అలవాటు చేసారు. మా ఇంట్లో అందరూ తెలుగు స్వచ్ఛంగా మాట్లాడతారు. నేను వేగంగా మాట్లాడ్డం వల్ల మొదట్లో ఎవ్వరికీ నా భాష అర్థంకాదు. (అప్పుడప్పుడూ మా నాన్నకి కూడా అర్థంకాదు) ఒత్తులు పలకకపోతే మా అమ్మ సహించలేదు. 'అంట' అనే పదం మా నాన్నకి నచ్చదు 'అట' అనమంటారు. ళ, ణ పలక్కపోతే నాకు పలకమీద గోళ్ళతో గీరినట్టుంటుంది.

నా ఫ్రెండ్స్‌లో కొంతమంది 'మొన్న'ని 'మన్న' అని, 'కళ్ళు'ని కల్లు'అని, 'కథ'ని కద' అని అంటారు. వాళ్ళని ప్రతీసారి సరిచేసి, సరిగ్గా పలికేంతవరకు ఊరుకోను. దీనివల్ల చాలామంది "లిపితో మాట్లాడితే తెలుగు టీచర్‌తో మాట్లాడినట్టు ఉంటుంది" అని అంటారు. "ఇక నుంచి ఇంగ్లీష్‌లో మాట్లాడ్తాం లిపి. మా వల్ల అవ్వట్లేదు" అని కొంతమంది అన్నారు. కానీ తెలుగు వచ్చిన వారితో తెలుగు మాట్లాడ్డం నాకున్న అలవాటు.

ఈ మధ్య సినిమాల్లో తెలుగు స్పష్టంగా మాట్లాడకపోవడం వల్ల మా అమ్మ, నేను సినిమాలు చూడ్డం మానేసాము. రెండున్నర గంటలు అలాంటి సినిమాని చూసి బయటికి వచ్చేసరికి నా చిరాకు, అసహనం కోపంగా మారడం వల్ల నన్ను సినిమాకి రమ్మని ఎవరూ ఒత్తిడి చేయరు. నాకు గుర్తుండి మా నాన్నతో ప్రివ్యూలకి తప్ప థియేటర్‌కి వెళ్ళి సినిమాని ఏనాడూ చూడలేదు.

చిన్నతనంలో కావ్య స్కూల్ నుండి ఇంటికి వచ్చి, "అమ్మా, నేను నా ఫ్రెండ్ సుష్మిత వాళ్ళ ఇంటికి వెళ్తాను" అంటే "సుష్మిత కాదు, సుస్మిత" అని సరిచేసేదట. అలాగే "సృషుత"ని "సృశుత" అని, "స్వేత"ని "శ్వేత"అని, మొదలగు పేర్లు పదాలు పలకడం నేర్పేదట. ఒకరోజు నేను కాలేజీనుండి ఇంటికి వచ్చాక "నా ఫ్రెండ్ నిషాంతిక ఇవాళ్ళ ఏం చేసిందో తెల్సా?" అని ఏదో చెప్పబోయాను. "ఏంటి? నీ ఫ్రెండ్ పేరు మజ్జిగ అని అర్థం వచ్చేట్టు పెట్టారా?" అని అడిగింది. "మజ్జిగేంటి?" అని ఏమీ అర్థంకాక అడిగాను.

"నిషా అంటే మత్తు, అంతిక అంటే అంతం చేసేది. మత్తు పోగొట్టేది మజ్జిగేగా" అని చెప్పింది. అది విని నేను నవ్వడం చూసి మా నాన్నకూడా నాతో కలిసి దాదాపు పదినిమిషాలు నవ్వారు.

మా నాన్న అచ్చ తెలుగు మాట్లాడతారు. నాకు కొన్నిసార్లు గ్రాంథికంగా అనిపిస్తుంది. తను తెలుగు మాట్లాడేటప్పుడు ఇంగ్లీష్ పదాలు, ఇంగ్లీష్ మాట్లాడేప్పుడు తెలుగు పదాలు వినపడవు. మా నాన్న ఇంగ్లీష్ బ్రిటీష్ అవ్వడంతో అమెరికన్ మేగజైన్స్‌కి రచనలు

పంపేముందు మార్పులు చేర్పులు చేస్తారు సాధారణంగా మా నాన్న వాడే ʻఅచ్చతెలుగుʻ పదాలు - ఫ్రెండ్ బదులు మిత్రుడు, న్యూస్ పేపర్‌ని దినపత్రిక అని, రిలేటివ్‌ని బంధువు అని అంటారు.

"వాడుక భాషలో అక్కడ ఒత్తు అవసరంలేదు, వైధీకపిల్లి" అని మా అమ్మ తరచూ అంటుంది. నాకు పన్నెండేళ్ళ వయసున్నప్పుడు మొదటిసారి ʻవైధీకపిల్లిʻ అనే పదాన్ని విన్నాను. "మామూలు పిల్లులు మియావ్ అంటే వైధీక పిల్లి మాత్రం మ్యావ్ అంటుంది" అని మా అమ్మ వివరించింది.

"నాన్న వైధీక పిల్లైతే నువ్వు వైఖానస కుక్కవా?" అని నవ్వాను. కుక్క బదులు ఎలుక అనైనా అనుండాల్సింది "అమ్మని పట్టుకుని కుక్క అంటావా" అని నాతో చాలామంది ఇప్పటికీ పోట్లాడతారు.

(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)

Click here to share your comments on this story